కొనలేం.. తినలేం..!

- కొండెక్కిన కూరగాయల ధరలు
- పదిరోజుల్లో అమాంతం పెరుగుదల

నరసాపురం రూరల్: మొన్నటి వరకూ ఎండలతో గ్రామాల్లో ఎక్కడిక్కడ కూరగాయలు, ఆకుకూరలు, దొండ, బీర, పొట్ల తదితర పాదులు దెబ్బ తిని పంట దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కొనలేం.. తినలేం.. అన్నట్టుగా కూరగాయల ధరలు కొండెక్కాయి. రోజు రోజుకూ మార్కెట్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సామాన్య మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. మరో పక్క ధరలు పెరగడంతో పెట్టుబడి పెరిగిందని, కొనుగోలు తగ్గిందని, వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడంతో వినియోగదారులపై మరింత ఆర్థిక భారం పడింది. సుమారు నెల రోజుల క్రితం వరకూ ధరలతో పోలిస్తే నేడు కొన్ని కూరగాయలు రెట్టింపు, మరికొన్ని అంతకు మించిపోయాయి. ఫలితంగా పేద, సామాన్య ప్రజానీకానికి కూరగాయలు భారంగా మారాయి. కూరగాయల దిగుబడి తగ్గిపోయి, డిమాండ్‌తో ధరలు పెరిగిపోయాయి. దీంతో అన్ని కూరగాయల ధరలు అమాంతం ఆకాశాన్నంటాయి. గతంలో ఈ ప్రాంతంలో పంటలు దెబ్బతింటే పొరుగు జిల్లాల నుంచి కూరగాయలు దిగుమతయ్యేవి. కాని ప్రస్తుతం వర్షాలు పడి మరలా పంట కాపుకు వచ్చే వరకూ ధరలు దిగొచ్చే పరిస్థితి లేదని వ్యాపారులు తెలిపారు. రెండు నెలల క్రితం రూ.100కు సంచి నిండేదని, ఇప్పుడు రూ.200 పెట్టినా సంచి నిండటం లేదని పేద, సామాన్య వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలు కన్నా కూరలే మేలు అనుకుంటే

గతంలో అత్యధిక ధరలకు కూరగాయలు కొనుక్కోవడం కన్నా కర్రీ పాయింట్లలో కూరలు కొనుక్కోవడమే మేలని వినియోగదారులు కర్రీ పాయింట్లను ఆశ్రయించేవారు. అక్కడ రూ.15 నుంచి రూ.25కు లభించే కూరలపై ఆధారపడేవారు. కర్రీ పాయింట్ల యాజమాన్యాలు కూడా అమాంతం పెరిగిన కూరగాయల ధరలతో గిట్టుబాటు అవ్వక కూరలు తక్కువగా ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. పలువురు వినియోగదారులు దీనితోనే సరి పెట్టుకుంటుండగా, మరికొందరు అధిక ధరలకు కూరగాయలు కొనుగోలు చేయక తప్పడం లేదు.



రైతు బజార్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కూరలు కొనలేక పోతున్నాం

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు కొనలేకపోతున్నాం. సుమారు నెల రోజుల క్రితం రేట్లకు ప్రస్తుత రేట్లకు ఏ మాత్రం పొంతన లేదు. ఇలాగైతే కూరగాయలు కొనలేం. డబ్బులు పెట్టినా నాణ్యమైన కూరగాయలు దొరకడం లేదు. అలాగని కర్రీ పాయింట్లలో కూరల కోసం వెళితే అక్కడ కూడా అధిక ధరలు వెచ్చించాల్సి వస్తోంది.



–రేపాక ఉమ, గృహిణి, నరసాపురం

పార్టీ నాయకులు ధైర్యంగా ఉండాలి

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసాపురం: పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ మెర్లిన్, మరో నేత మైకేల్ బుధవారం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకులిద్దరినీ ఆప్యాయంగా పలకరించి, ఎన్నికల తరువాత నాటి స్థానిక విషయాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులు దిగువ శ్రేణి కార్యకర్తల విషయంలో ఎలా వ్యవహరిస్తున్నారనే అంశాలను ఆరా తీసినట్టు మెర్లిన్ తెలిపారు. పార్టీకి మంచి రోజులు వస్తాయని ధైర్యంగా ఉండాలని సూచించారన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, ఏ అవసరం వచ్చినా, కష్టం వచ్చినా కార్యర్తలు నేరుగా తనను కలవచ్చని ధైర్యం చెప్పారని పేర్కొన్నారు.



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మెర్లిన్, మైకేల్

ధాన్యం నగదు చెల్లించాలి

పెనుగొండ: రైతుల ధాన్యానికి నగదు సత్వరం చెల్లించాలని సీపీఎం నాయకులు తలుపూరి బుల్లబ్బాయి అన్నారు. కౌలు, పేద రైతులకు తక్షణమే ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఐపీ శెట్టికి వినతి పత్రం అందించారు. మండలంలో ఇప్పటి వరకూ కేవలం రూ.7 కోట్లు మాత్రమే చెల్లింపులు అయ్యాయని, మరో రూ.55 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నెలలు తరబడి డబ్బులు చెల్లించకపోవడం వలన తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉన్నతాధికారులు రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు, పి.మోహన్‌రావు, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి రాఘవులు పాల్గొన్నారు.



ఆచంటలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు

పాలకొల్లు (సెంట్రల్): దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్ భూసార పరీక్షలు, కర్బన ఉద్గారాలు, కొల్లేటి తీర పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మంచినీటి సంరక్షణ, కాలుష్య నివారణ చర్యలు, మన ప్రాంత పర్యావరణానికి అనుగుణంగా సాగు చేసుకోవాల్సిన పంటల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, డాక్టర్ రూప్‌సింగ్, డాక్టర్ రమణ, డాక్టర్ సత్యనారాయణ, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్

ప్లాంట్ ఏర్పాటుపై సమీక్ష సమావేశం

పోడూరు: కవిటం, పోడూరు సరిహద్దులో నల్లవెంకయ్య చెరువు ప్రాంతంలో ఐఎంసీ ప్రైవేట్ సంస్థ ఆయిల్, గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో తప్పనిసరిగా ప్రజలు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. నల్లవెంకయ్య చెరువులో ఆయిల్, గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం బుధవారం కవిటం జెడ్పీ హైస్కూలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్లాంట్ ఏర్పాటుపై పలువురు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యం, పర్యావరణం దెబ్బ తినే పరిస్థితులు ఉంటే ప్లాంట్ ఏర్పాటు చేయొద్దన్నారు. ప్లాంట్ ఏర్పాటు చేస్తే గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలనీ, స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కొందరు కోరారు. సమావేశంలో నరసాపురం ఆర్డీవో అంబరీష్ మాట్లాడుతూ గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ సమావేశంలో స్థానిక తహసీల్దార్ ఎం.మురళీకృష్ణ, ఎంపీడీవో డి.సుహాసిని, ఆర్ఐ కె.రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

విద్యార్థులు కష్టపడి చదవాలి

నరసాపురం: విద్యార్థులు చదువు విలువ తెలుసుకొని కష్టపడి చదవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. పట్టణంలోని 31వ వార్డు నిప్పులేటి హైమావతి హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం విద్యా కిట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ఒరవడి కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సూర్యకుమారి మట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతీ ఏటా పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బళ్ల తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

మేనరిక వివాహాలతో అనర్థమే

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్యజీవన్

పాలకొల్లు అర్బన్: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని (వారసత్వ ఎర్ర రక్త కణాల రుగ్మత)ను 2047 నాటికి శాశ్వతంగా పరిష్కరించే దిశగా వైద్య యంత్రాంగం పని చేస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.నవ్యజీవన్ అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. సాధారణంగా ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటాయని, కానీ ఈ సికిల్ సెల్ ఎనీమియాలో రుగ్మత కారణంగా ఎర్ర రక్త కణాలు అర్ధ చంద్రాకారంగా, కొడవలి రూపంలో ఉంటాయన్నారు. ఈ కణాలు ఆక్సిజన్ సరఫరాకి ఆటంకం కలిగిస్తాయన్నారు. ఇవి తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతాయన్నారు. అందుకే మేనరిక వివాహాలు చేసుకోకూడదన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో నివసించే వారికి వస్తుందన్నారు. ఈ వ్యాధిలో రక్త కణాల సంఖ్య తగ్గిపోవడం, రక్తహీనత, తీవ్రమైన కీళ్ల నొప్పులు, శ్వాస సమస్యలు, అలసట, గర్భధారణలో ఇబ్బందులు, అంగవైకల్యం తదితర లక్షణాలు బయట పడతాయన్నారు. ఈ లక్షణాలు గల వారు తక్షణం వైద్యుడిని సంప్రదించి ఆరోగ్య పరీక్షలు చేయించుకొని, మందులు వాడాలని డాక్టర్ నవ్యజీవన్ కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్లు ఎస్కే అమలేశ్వరరావు, డి.కమల, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నవ్యజీవన్

అనాథ శవానికి అంత్యక్రియలు

పెనుగొండ: సిద్ధాంతం కేదారీఘాట్‌లో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి గ్రామ సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), పంచాయతీ సభ్యులు ఆదర్శ ప్రాయులుగా నిలిచారు. వివరాల్లోకి వెళితే నాలుగు నెలలుగా సిద్ధాంతం వశిష్ట గోదావరి తీరంలో 50 ఏళ్ల మహిళ ఉంటుంది. అప్పటి నుంచి స్థానిక సచివాలయ సిబ్బంది, అధికారులు ఎంత ప్రయత్నించినా మహిళ వివరాలు సేకరించలేకపోయారు. మహిళ సరిగా మాట్లాడలేకపోవడం, పక్షవాతం వలన వివరాలు సేకరించడంలో విఫలమయ్యారు. దీంతో స్థానిక సిబ్బంది మహిళకు ఆహార పానియాలు అందించేవారు. ఈ తరుణంలో బుధవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచింది. సర్పంచ్ చంటికి స్థానిక సిబ్బంది సమాచారం అందించడంతో మృత దేహం వద్దకు పంచాయతీ సభ్యులతో కలిసి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో పంచాయతీ సభ్యులు నక్కా సత్యనారాయణ, అంజూరి శ్రీను, ఆకుల వీర్రాజులు పాల్గొన్నారు.



అనాథ శవాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న సర్పంచ్ చంటి, పంచాయతీ సభ్యులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనుమంట్ర: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఓడూరు గ్రామ సర్పంచ్ బుర్రా రవికుమార్ అన్నారు. బుధవారం ఓడూరు యూపీ పాఠశాలలో 82 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందించే నోట్స్, పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, షూస్‌లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తి విజయకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బైరే భాను, ఉప సర్పంచ్ ఇందుకూరి సాయిసుబ్బరాజు, ఇందుకూరి వెంకట నరశింహరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఓడూరు యూపీ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేసిన దృశ్యం

శెట్టిబలిజ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



ములపర్రులో శెట్టిబలిజ సంఘ నూతన కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులు

పెనుగొండ: ములపర్రు శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గ అధ్యక్షుడుగా కడలి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ములపర్రు ఆరు శెట్టిబలిజ సంఘాలు కలిసి గ్రామ సంఘంగా ఏర్పడి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా కడలి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా గుడాల లోకేశ్వరరావు, కార్యదర్శిగా కట్టా రామకృష్ణ, 12 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

30 నుంచి ఆషాడ మాస జాతర మహోత్సవాలు

వీరవాసరం: రాయకుదురులో శ్రీ మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, శ్రీ పోతురాజు స్వామి వార్ల ఆషాడ మాస జాతర మహోత్సవాలు ఈ నెల 30 నుంచి ప్రారంభించినున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కొండవీటి రామచంద్రరావు తెలిపారు. అలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ నెల 30న అమ్మవార్లను ఆలయం నుంచి పూరిగుడిసెకు తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. జులై 4న అమ్మవార్ల గవర్లగుడుపు, 5న అమ్మవార్ల ఆషాడం జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

సత్తిరాజు సేవలు అభినందనీయం



సీపీఎం నేత సత్తిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

పాలకొల్లు అర్బన్: సీపీఎం పార్టీకి, ప్రజా సమస్యల పోరాటానికి కామ్రేడ్ సత్తిరాజు సేవలు అభినందనీయమని సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారామ్ అన్నారు. మండలంలోని అరట్లకట్ట గ్రామానికి చెందిన సీపీఎం నేత కూనపరాజు సత్యనారాయణరాజు (సత్తిరాజు) సంతాప సభ బుధవారం నిర్వహించారు. సీపీఎం నాయకులు పాల్గొని సత్తిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడుతూ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రుద్రరాజు శ్రీనివాసరాజు (వాసురాజు), సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్, డెల్టా జిల్లా కార్యదర్శి ఎ.రవి, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, రచయిత లింగం సత్యనారాయణ మూర్తి, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, సీపీఎం నాయకులు పెద్దిరాజు, చల్లా సోమేశ్వరరావు, తదితరులు పాల్గొని సత్తిరాజు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఉచిత హోమియో వైద్య శిబిరం



పెనుగొండలో బ్రహ్మకుమారీస్ ఉచిత వైద్య శిబిరం

పెనుగొండ: బ్రహ్మకుమారీస్ ఓంశాంతి ఆధ్వర్యంలో పెనుగొండలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తేతలి వారి వీధిలో బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో బుధవారం ఉదయం నుంచి హోమియో వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ వైద్య పరీక్షలు నిర్వహించారు. 190 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఉషా, మణి, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మేరీ

మొగల్తూరు: విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలలో ముందుండాలని సర్పంచ్ పడవల మేరీ కోరారు. బుధవారం మొగల్తూరు పంచాయతీ కోట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, బెల్టులు, సాక్స్, బ్యాగ్‌లతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన కిట్లు ప్రతీ విద్యార్థికి చేరేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు యర్రమిల్లి గణపతి, పడవల సత్యనారాయణ, ఉపాధ్యాయురాలు కేవీవీ.సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో భారీ వర్షం



వర్షంతో బురదమయంగా మారిన వెలగలవారిపాలెం రోడ్డు

పెనుమంట్ర: మృగశిర కార్తె ప్రారంభమయ్యి, పది రోజులు కావొస్తున్నా ప్రజలకు గ్రీష్మ తాపం తప్పడం లేదు. నాలుగు రోజులుగా ఎండ, ఉక్కపోతతో ప్రజలు సతమతమౌతుండగా బుధవారం తెల్లవారు జామున పెనుమంట్ర మండలంలో భారీ వర్షం కురిసినప్పటికీ ఉక్కపోత తగ్గలేదు. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ప్రజలు సతమతమయ్యారు. మండలంలో 60.2 మీమీ అత్యధిక వర్షపాతం నమోదైనప్పటికీ కొద్దిసేపటికే ఎండ తీవ్రత పెరగడంతో రోడ్లన్నీ ఎండతీవ్రతకు వేడెక్కిపోయాయి. భారీ వర్షం కురవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వర్షం వస్తే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

పాలకోడేరు: ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడినందున గ్రామంలో అన్ని వర్గాల వారు కలిసి మెలసి ప్రశాంతంగా జీవించాలని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు హితవు పలికారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బుధవారం శృంగవృక్షం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారిని గేలి చేయడం గానీ, గెలిచిన వారి బ్యానర్లు, ఫ్లెక్సీలు ధ్వంసం చేయడం గానీ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం గానీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సత్యకృష్ణ, కుసుమ గుప్త, కొల్లా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎనీమియాపై అవగాహన సదస్సు



కాళ్ల ప్రభుత్వాసుపత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు సునీల్

కాళ్ల: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వం ద్వారా వచ్చిన ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహామని కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు సరాబు సునీల్ తెలియజేశారు. కాళ్ల ప్రభుత్వాసుపత్రి వద్ద సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సునీల్ మాట్లాడుతూ మన రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోప భూయిష్టంగా ఉంటాయని తెలిపారు. ఈ వ్యాధిని 2047 నాటికి నిర్మూలించుటకు ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ఇది అంటువ్యాధి కాదని జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి రక్తం మార్పిడి చేయించాలని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డీ.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ హుండీ లెక్కింపు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఈవో డి.రామకృష్ణంరాజు బుధవారం తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొన దలిచిన వారు తమ పేర్లను ముందుగా కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారి పాలెంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. యర్రంశెట్టి బాబులు, నాగముత్యమాంబ దంపతులు, కూనపరెడ్డి చంటి దంపతులు, యర్రంశెట్టి మోహనరావు దంపతులు, నందుల సత్యప్రసాద్ దంపతులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కన్నుల పండుగగా జరిగిన ఈ వేడుకలను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అఖండ అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి కోసం ప్రజల ఇక్కట్లు

మొగల్తూరు: మొగల్తూరు పంచాయతీ వడయార పేట గ్రామస్తులు గత వారం రోజులుగా తాగునీరందక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మొగల్తూరులోని భారీ మంచినీటి చెరువు నుంచి తాగు నీరు సరఫరా అవుతుంది. అయితే కొన్ని రోజులుగా తాగు నీరందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావును వివరణ కోరగా నీటి సరఫరాలో ఏర్పడిన సమస్య కారణంగా తాగు నీరందడం లేదని, రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.

చేనేతలకు అండగా నిలవాలి

పెనుగొండ: నూతన ప్రభుత్వం చేనేతలకు అండగా నిలవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంలో చేనేతలకు రూ.24 వేలు అందించారని తెలిపారు. చేనేత వ్యవస్థను నమ్ముకొని బడుగు బలహీన వర్గాలు ఉన్నాయన్నారు.